ఎన్నికలొచ్చాయి! ప్రజాస్వామ్యాన్ని గురించి ఆలోచిద్దాం !!

# పార్టీలనూ, అభ్యర్థులనూ ప్రశ్నిద్దాం, నిలదీద్దాం!

ప్రజలారా!

పన్నెండవ లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. అయిదేళ్లు నిండకుండానే ఆయుస్సు తీరిన పార్లమెంట్ రద్దుకాగా, అన్ని పార్టీలూ మళ్లీ 'మమ్మల్ని గెలిపించండి' అంటూ ప్రజల దగ్గరకు వస్తున్నాయి.

మధ్యంతర ఎన్నికలు రావడానికి కారణం ప్రభుత్వ విధానాలకు ప్రజల ఆమోదం ఉందో లేదో అన్న ప్రజాస్వామిక సందేహం కాదు. ఆ విధానాలు ప్రజల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండ వడివడిగా మార్చబడుతున్నాయి. కాబట్టి అటువంటి సందేహం మన పాలకులకు వస్తే సంతోషిద్దుము.

కానీ మనల్ని ఏలేవారికి అటువంటి ప్రజాస్వామిక సందేహాలెప్పుడూ రావు. ఒక్కసారి మన వోట్లు వాళ్లను అధికారపీఠంపైన కూర్చోబెడితే ఆ తరువాత తాము ఏం చేసినా దానికి మన ఆమోదం ఉన్నట్టేనని దబాయించే బాపతు మనదేశ రాజకీయ పార్టీలు. ఎన్నికలు ఇంత త్వరగా రావడానికి కారణం మనపాలకుల మనస్సులలో తమ సాధికారత గురించి సందేహాలు రావడం కాదు.

ఎవరెవరి అధికార దాహం, ఎవరెవరి రాజకీయ అవకాశవాదం ఎన్నికలకు దారి తీసిందో అందరికీ తెలుసును. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే ఈ అవలక్షణాలను అసహ్యించుకోవలసిందే. అయినప్పటికీ రేపు జరగబోయే ఎన్నికల ద్వారా ఎవరో ఒకరు అధికారానికి రావడమూ జరుగుతుంది. తాము చేయబోయే పనులన్నిటికీ మన ఆమోదం ఉందని దబాయించడమూ జరుగుతుంది. కాబట్టి, 'మనం కోరుకోని ఈ ఎన్నికల గొడవ మనకెందుకు' అని ఊరుకోకుండ క్రియాశీలకంగా వ్యవహరిద్దాం. మన దగ్గరకు వచ్చే అభ్యర్థులను, పార్టీలను మన సమస్యల గురించి, వాళ్ల వైఖరి గురించి నిలదీద్దాం. చివరికి మనం ఎవరికో ఒకరికి వోటు వేసినా ఎవరికి వేసీ ఉపయోగం లేదనుకున్నా ఈ క్రియాశీలక వైఖరి అవసరం. ప్రజాస్వామ్యం మనకోసం ఉనికిలోకి వచ్చిన వ్యవస్థ. రాజకీయ నాయకుల డబ్బు సంపాదన కోసం కాదు. మరి దేనికోసమూ కాదు.

**ఎన్నికలు ప్రజల సమస్యల పరిష్కారానికీ ప్రజాజీవిత పురోగమనానికి ఒక సాధనంగా పని చేయాలి.** అప్పుడే అవి ప్రజాస్వామ్యంలో వాటి పాత్ర నిర్వహించినట్టవుతుంది. దాని బదులు అధికారం చలాయించడానికి ఒకరికో మరొకరికో అవకాశం కల్పించే ప్రక్రియగా దానిని మార్చి వేసే ధోరణి రాజకీయాలలో ప్రబలింది. దానిని ప్రశ్నించాలి. నిలదీయాలి తిరస్కరించాలి. ఎవరు గెలిచినా, ఎవరు ప్రభుత్వ అధికారం చలాయించినా అది ప్రజల అభ్యున్నతి కోసం జరిగినప్పుడే ప్రజాస్వామికం అవుతుంది. ఎన్నికల ప్రక్రియ అందుకోసం ఉపయోగపడినప్పుడే అది సార్థకం అవుతుంది. దానిని ఆ విధంగా మలచడానికి ఒత్తిడి పెట్టడం మన బాధ్యత, మనహక్కు. ఎన్నికలను, రాజకీయపార్టీలను, అభ్యర్థులను ఈ కోణం నుండి చూద్దాం.

ఈ అవగాహన ఈ రోజు పత్రికారంగంలో సహితం లోపించడం దురదృష్టకరమైన విషయం. ఈ రోజే కాదు. ఈ మధ్యకాలంలో జరిగిన ప్రతీ ఎన్నికలోనూ పత్రికలు నిర్వహిస్తున్న పాత్ర 'బలసమీకరణ' పైన రన్నింగ్ కామెంటరీ ఇవ్వడం. ఎవరి 'బలం' ఎంత పెరిగింది. ఎవరెంత చాకచక్యంగా తమ 'బలం' పెంచుకుంటున్నారు అని వ్యాఖ్యానించడమే తమ పాత్ర అని పత్రికలు భావిస్తున్నాయి. ఈ బలసమీకరణ కోసం పార్టీల లోపల వెలుపల జరిగే ముఠా కొట్లాటలను వర్ణించడమే రాజకీయ విశ్లేషణ అని భావిస్తున్నాయి. అది ఏరకమైన బలం? కండబలమా, డబ్బుబలమా, సారాయి బలమా, గుండా బలమా లేకపోతే ప్రజోపయోగమైన ఆచరణ ద్వారా వచ్చిన ప్రజాస్వామిక బలమా అన్న ప్రశ్న పత్రికలకు అక్కరలేకుండా పోయింది. ఈ అనైతిక వైఖరి ప్రజాస్వామ్యంలో పత్రికారంగానికి తగినది కాదు.

ఈసారి అక్కడితో ఆగిపోకుండ చాలా పత్రికలు ఒక పార్టీని (మొహమాటం ఎందుకు - భారతీయ జనతాపార్టీని) అందలమెక్కించడానికి ముందే నిర్ణయించుకొని అందుకు అనుకూలమైన వాతావరణాన్ని వార్తావాఖ్యల రూపంలో కల్పించడానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఇది మరీ అభ్యంతరకరమైన విషయం. నిజంగానే ఈ పార్టీకి పార్లమెంట్‌లో మెజార్టీ సీట్లొస్తే దాని హక్కును ఎవరూ కాదనలేరు. **కానీ పత్రికల కర్తవ్యం ఏదో ఒక పార్టీ గెలుపుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం కాదు.** ప్రజాప్రయోజనాలనూ ప్రజాస్వామ్య పురోగమనాన్నీ ప్రమాణంగా పెట్టుకొని పార్టీల వ్యవహార శైలినీ విధానాలనూ నిలదీయడం, నిలదీయడానికి అవసరమైన సమాచారాన్నీ విశ్లేషణనూ ప్రజలకు అందియ్యడం.

సరళీకరణ, ప్రైవేటీకరణల పేరిట ఏడేళ్లుగా దేశంలో అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల వల్ల ప్రజల జీవించే హక్కుకూ, జీవితాన్ని మెరుగుపరచుకునే హక్కుకూ ఏర్పడుతున్న విఘాతం ఇప్పటికే అనుభవంలోకి వస్తున్నది. వందలాది మిల్లుల మూసివేత, లక్షలాది కార్మికుల రిట్రెంచ్‌మెంట్, కుదించుకుపోతున్న ఉద్యోగ అవకాశాలు, నిధుల కేటాయింపు తగ్గించడం వల్ల నీరు గారిపోతున్న సంక్షేమ విధానాలు, విద్య ప్రైవేటీకరణవల్ల (అసలే విద్యారంగంలో ప్రపంచంలోనే అధమ స్థానంలో ఉన్న భారతదేశంలో) చదువుకు దూరం అవుతున్న దళితులు, స్త్రీలు, పేదలు, వైద్యరంగం నుండి ప్రభుత్వం నెమ్మదిగా తప్పుకుంటుండడం వల్ల రోగం కంటె డాక్టర్ బిల్లుకు ఎక్కువ భయపడుతున్న పేద ప్రజల పరిస్థితి - ఇవన్నీ ప్రజలకు అనుభవానికి వస్తున్నాయి. ప్రైవేటీకరణ విధానాల వల్ల బాగా

బలహీనపడిన ప్రభుత్వ బ్యాంకు వ్యవస్థ రైతుల పెట్టుబడి అవసరాలకు ఎంత మాత్రం సరిపోకపోవడమే కదా ఈ మధ్య మన రాష్ట్రంలో 70కి పైగా రైతుల ప్రాణాలు తీసిన 'పత్తిరైతుల ఆత్మహత్యల' గాధల సారాంశం? ఆ రైతులలో అత్యధిక భాగం ఎస్.సి.ఎస్.టి. బి.సి. కులాలకు చెందిన పేద రైతులు కారా? అంటే ప్రభుత్వ సంక్షేమ విధానాలు ప్రధానంగా కాపాడవలసిన ప్రజలు కారా?

ఈ సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల గురించి ఏ పార్టీ ఏమంటుంది? అది అన్ని పార్టీల ఉమ్మడి ఆమోదం ఉన్న మార్పు కాదా? తాము ఈ విధానాలతో విభేదిస్తున్నామని చెప్పే పార్టీలు కూడ ఆ విభేదానికి తమ రాజకీయాలలో ఏమాత్రం ప్రాముఖ్యం ఇస్తున్నాయి? ఆ విభేదం కంటే అధికార పరుగు పందెంలో సంఖ్యాబల సమీకరణే ముఖ్యం అయిందన్న విషయం మనం చూడడం లేదా?

**ఈ ప్రశ్నలు అడుగుదాం. అడిగి నిలదీద్దాం.**

ఆర్థిక విధానాలకు సంబంధించిన ప్రశ్నలకు సులభమైన జవాబు లేదంటారేమో, పోనీ సులభమైన జవాబున్న ప్రశ్నలకయినా ఈ పార్టీలన్నీ తమ ఆచరణ ద్వారా సమాధానం చెప్తాయా? రాజకీయాలలో పెరిగిపోతున్న నేర ప్రవృత్తి గురించి ఈ రోజు ప్రజలందరూ ఆందోళన చెందుతున్నారు. రాజకీయ పార్టీలు తాము సహితం ఆందోళన చెందుతున్నామని అంటున్నారు. ఏదయినా న్యాయమైన సంఘర్షణలో పాల్గొని లేదా తమ ప్రమేయం లేని పరిస్థితుల ప్రభావం వల్ల - జైలు పాలయిన వాళ్ల గురించి మాట్లాడుకుందాం. మన ప్రాంతాలలో అటువంటి వ్యక్తులెవరో మనకందరికీ తెలుసును. వారిని రాజకీయ పార్టీలు దూరం ఉంచుతాయా? కనీసం అటువంటి వారికి టిక్కెట్లియ్యకుండ ఉన్నాయా? ముఖ్యంగా, రాయలసీమ జిల్లాలలో? లేకపోతే రాజకీయాలలో నేరప్రవృత్తి పెరుగుతున్నదంటూ వీరు కార్చే కన్నీళ్లను మనం ఎందుకు గౌరవించాలి?

**ఈ ప్రశ్నలు అడుగుదాం. అడిగి నిలదీద్దాం.**

వెనువెంటనే చేయగల ఇంకొన్ని పనుల గురించి అడుగుదాం. గత పార్లమెంటులో స్త్రీల రిజర్వేషన్ బిల్లు గురించి జరిగిన గొడవ మనకందరికీ జ్ఞాపకం ఉంది. చట్టసభలలో స్త్రీలకు మూడవ వంతు సీట్లు కేటాయించాలన్న విషయంలో సూత్రప్రాయంగా తమకు అభ్యంతరం లేదని అన్ని రాజకీయ పార్టీలూ అన్నాయి. ఆ కోటాలో బీసీలకు రిజర్వేషన్ ఉండాలా లేదా అన్న విషయంలో మాత్రం విభేదం ఉందన్నారు. మరి ఇప్పుడు ఎన్నికలలో అన్ని పార్టీలూ స్త్రీలకు మూడవ వంతు టిక్కెట్టియ్య వచ్చును కదా? ఇచ్చారా? మూడవ వంతు కాకపోతే కనీసం పదవవంతయినా ఇచ్చారా? ఎందుకియ్యలేదు? సంకల్పం ఉంటే అసాధ్యమేమీ కాదని మొన్న బ్రిటన్‌లో గెలిచిన లేబర్ పార్టీ చూపించింది కదా?

స్త్రీలలాగే దళితుల విషయం కూడ. దళిత బహుజన కులాలకు అన్ని పార్టీలూ కొన్ని టిక్కెట్లయితే ఇస్తాయిగానీ తమ ప్రభుత్వంలో ప్రధాన పదవులు వారికే ఇస్తామని అన్ని రాజకీయ పార్టీలూ హామీ ఎందుకియ్యవు? తాము ఎంపిక చేయబోయే ప్రధాన మంత్రిని ఇప్పటికే ప్రకటించిన ఒకే ఒక పార్టీ ఒక బ్రాహ్మణుడిని ఎంపిక చేసింది. మిగిలిన పార్టీలు పేరు ప్రకటించకపోతే పోయినాయి, (అది మంచి సంప్రదాయం కాదని మేము కూడ ఒప్పుకుంటున్నాము) కానీ కనీసం హైందవ సంప్రదాయంలో అధికారం చలాయించే అవకాశం నిరాకరించబడిన ప్రజలలో ఒకరిని తప్పక ఎంపిక చేస్తామని ఎందుకు అనలేకుండ ఉన్నాయి? అనలేనప్పుడు దళితులకు అధికారం కట్టబెడతామని వీళ్లంతా మాట్లాడడం ఎందుకు?

**ఈ ప్రశ్నలు అడుగుదాం. అడిగి నిలదీద్దాం.**

ప్రజాస్వామ్య రాజకీయాలలో ఉన్న పార్టీలూ వ్యక్తులూ గతంలో ప్రజలు సాధించుకున్న ప్రజాస్వామ్యాన్నీ హక్కులనూ కాపాడడంలోనూ వాటిని పెంపొందించడంలోనూ నిమగ్నం కావాలి. కానీ అది ఏ మేరకు జరుగుతూ ఉంది? పోలీసుల విచ్చలవిడితనం నుండి పౌరులకు రక్షణ కల్పించే చట్టాలు, ఎస్.సి.ఎస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టం, వరకట్న నిషేధచట్టం, కుటుంబహింసను నేరంగా గుర్తించే చట్టాలు, కనీస వేతనాల చట్టం, స్త్రీ పురుషులకు సమానవేతనాలివ్వాలన్న రాజ్యాంగ ఆదేశం, కార్మికులు అసంఖ్యాకంగా పోరాటాలు చేసి సాధించుకున్న అనేక హక్కులు, కులపరమైన రిజర్వేషన్లు, ఆదివాసీల భూమి హక్కును కాపాడే 1 ఆఫ్ 70 చట్టం, పేద దళిత మహిళా విద్యార్థులకు వసతులు కల్పించే సంక్షేమ చట్టాలు, మైనారిటీలకు సమాన ప్రతిపత్తి సమాన హక్కులు కల్పించే రాజ్యాంగ లౌకిక వాద సూత్రాలు, ప్రత్యేక చట్టాలు ... ఇవన్నీ అమలులో అనేక ఆటుపోట్ల నెదుర్కుంటున్నాయి. వాటిని కాపాడడానికి ఏ పార్టీ ఏం చేసింది, ఏ అభ్యర్థి ఏం చేసారు అని మనం అడగొద్దా? అంతేకాక, సంక్షేమ చట్టాల వల్ల అభివృద్ధి కుంటుపడిందని వాదించే వాళ్లు, కార్మికుల హక్కుల వల్ల దేశ ఉత్పత్తి పెరగడం లేదని మాట్లాడేవాళ్లు, లౌకిక వాదం దేశ సమైక్యతకు గొడ్డలిపెట్టని ఘోషించే వాళ్లు ఈ జు మనల్ని ఏలుతామని ముందుకు వస్తున్నారు. వాళ్ల అర్హతను మనం ప్రశ్నించవద్దా?

ఇవి దేశానికి మొత్తంగా వర్తించే ప్రశ్నలు. వాటితో మొదలుపెట్టి మన ఊరి రోడ్ల గురించి, స్కూలు గురించి, ఆస్పత్రి గురించి, మన పొలాలకు రాని సాగునీటి గురించి, అడుగుదాం, నిలదీద్దాం. డబ్బు, సారాయి, గుండాయిజాల నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం.

**ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం**
**(APCLC)**

31-1-1998
విశాఖపట్నం.